# నేటి నుంచి ఆరోగ్యమిత్రల సమ్మె

- వేతనాల పెంపు, ఉద్యోగ భద్రతకు డిమాండ్
- ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న 94మంది మిత్రలు
- ఆరోగ్యశ్రీ సేవలకు కలుగనున్న ఆటంకం



విలేకరుల సమావేశంలో నినాదాలు చేస్తున్న ఆరోగ్య మిత్రలు

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 17 : సమస్యలు పరిష్కరించాలని రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రలు బుధవారం నుంచి సమ్మెబాట పట్టనున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆరోగ్యమిత్రలు కొన్ని నెలలుగా వైద్యారోగ్యశాఖ మంత్రితోపాటు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో, సచివాలయ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తూ వస్తున్నారు. కానీ ఇప్పటి వరకు అధికారులు, ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో వారంతా సమ్మెలోకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు.

**ఉమ్మడి జిల్లాలో 94 మంది..**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య శ్రీ పథకం కింద 95 మంది ఆరోగ్య మిత్రలు పనిచేస్తున్నారు. వీరంతా ప్రభుత్వ దవాఖానతోపాటు ప్రైవేట్ దవాఖానల్లో పనిచేస్తున్నారు. ఆరోగ్య శ్రీ పథకం కింద రోగుల వివరాల నమోదు, పేషంట్ అడ్మిషన్ నుంచి డిశ్చార్జ్ వరకు వైద్య సేవలపరంగా, ఇతరత్ర నిర్వహణలో వీరు కీలకంగా వ్యవహరిస్తున్నారు. అయితే 2007లో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించినప్పుడు ఆరోగ్య మిత్రలకు రూ.3,500 వేతనంగా ఇచ్చేవారు. 2012లో రూ.7200, 2015లో కేసీఆర్ ప్రభుత్వం రూ.12 వేలు చేశారు. తర్వాత కేసీఆర్ ప్రభుత్వంలో మళ్లీ పీఆర్‌సీ అమలు చేయడంతో రూ.15,600 పెరిగింది. అయితే రెండు మూడేండ్లుగా వేతనాలు పెరగక పోవడంతో కుటుంబాలు గడవడం కష్టంగా మారింది. కొద్ది రోజులుగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నా సంబంధిత అధికారులు కానీ, ప్రభుత్వం కానీ స్పందించడం లేదు. దీంతో నేటి నుంచి వారు సమ్మెలోకి వెళ్లనున్నారు. వీరు సమ్మెకు దిగితే ఆరోగ్య శ్రీ పథకం ద్వారా వైద్య సేవలు పొందేందుకు వచ్చే రోగులకు ఇబ్బందులు ఎదురుకానున్నాయి.

**డిమాండ్ల ఇవే..** ఆరోగ్య పథకం కింద 16ఏండ్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించి శాశ్వతా ఉద్యోగాలుగా గుర్తించాలని, డీపీవో క్యాడర్ కల్పించాని, జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు అమలు చేయాలని, విధి నిర్వహణలో మరణిస్తే రూ.50 లక్షల ఆర్థిక సాయం అందజేయడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, హెల్త్ కార్డులివ్వాలని, షఫ్లింగ్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**సమ్మెకు సహకరించాలి :** ఆరోగ్య మిత్రలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతోపాటు వేతనాలు పెంచాలని డిమాండ్‌తో సమ్మెలోకి వెళ్తున్నామని ఆరోగ్య మిత్రల సంఘం జిల్లా అధ్యక్షుడు గిరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి మురళీ, కోశాధికారి సంజీవ, గౌరవ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ ప్రకటించారు. ఆరోగ్య మిత్రల సమ్మెలకు ప్రజలు పూర్తిగా సహకరించాలని కోరారు.

## భూనిర్వాసితుల డబ్బులు ఇవ్వాల్సిందే..

జడ్చర్ల, సెప్టెంబర్ 17 : జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్ రిజర్వాయర్‌లో భూములు, ఇండ్లు కోల్పోయిన భూనిర్వాసితుల ఇంటి నిర్మాణాల కోసం ప్రభుత్వం మండలంలోని జయప్రకాష్‌నగర్ కాలనీకి చెందిన వారి నుంచి ఆరున్నర ఎకరాల భూమిని తీసుకున్నది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఎకరాకు రూ.12లక్షల చొప్పున పరిహారం చెల్లించింది. అయితే ఇందులో రెండున్నర ఎకరాలకు సంబంధించిన డబ్బులను గుంటల లెక్కన కొంతమందికి ఇచ్చినట్లు తెలిసింది. మిగతా డబ్బులను భూములు ఇచ్చిన రైతులందరికీ ఇవ్వకుండా ఇద్దరు వ్యక్తులు తీసుకున్నట్లు భూములు ఇచ్చిన రైతులు తెలిపారు. ప్రభుత్వానికి తాము భూములు ఇస్తే డబ్బులను సంబంధం లేని వ్యక్తుల ఖాతాల్లోకి రూ.54లక్షల వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన ఇద్దరి ఖాతాల్లో డబ్బులు జమ అయినట్లు తెలియడంతో వారి ఇంటికి వెళ్లి నిలదీశారు. దాంతో వారు సమాధానం చెప్పలేక పోతున్నారని తెలిపారు. అయితే డబ్బులు తమ ఖాతాలలో పడ్డాయని అందులో నుంచి కొంత డబ్బులు గతంలో ఉన్న రెవెన్యూ అధికారులకు ఇచ్చినట్లు చెబుతున్నారన్నారు. ఈ విషయమై మూడురోజుల కిందట జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి గ్రామస్తులు ఫిర్యాధు చేశారు. ఈ విషయంపై విచారణ జరిపించి బాధులపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపినట్లు గ్రామస్తులు తెలిపారు.

## ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

మిడ్జిల్, సెప్టెంబర్ 17 : కేఎల్‌ఐ కాల్వ మరమ్మతు పనులు నాణ్యత లేకుండా మట్టి పోసి చేతులు దులుపుకున్న ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం బీఆర్ఎస్, బీజేపీ నాయకలు కాల్వ మరమ్మతు పనులను పరిశీలించారు. భారీ వర్షాలకు మున్ననూర్ కేఎల్‌ఐ కాల్వ తెగిపోవడంతో నామమాత్రంగా మట్టిపోసి చేతులు దులుపుకొన్నారని మండిపడ్డారు. పంటలు చేతికొచ్చే సమయంలో నాణ్యత లేకుండా పనులు చేపట్టడం వల్ల సాగునీటికి ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుదర్శన్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, మండలాధ్యక్షుడు లాలు తదితరులు ఉన్నారు.

## ఐక్యతతోనే హక్కుల సాధన

మూసాపేట, సెప్టెంబర్ 17 : గౌడ కులస్తులంతా ఐక్యతతో ఉంటేనే హక్కులను సాధించుకోగలమని మాజీ జెడ్పీటీసీ రామన్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని చక్రాపూర్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దయాకర్ గౌడ్, ఉపాధ్యక్షులుగా శంకరయ్యగౌడ్, మన్నెంకొండగౌడ్, ప్రధాన కార్యదర్శిగా శేఖర్‌గౌడ్, సంయుక్త కార్యదర్శిగా మోహన్‌గౌడ్, కోశాధికారిగా చిన్న వెంకటయ్యగౌడ్‌లతో పాటు పలువురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు శశివర్ధన్‌గౌడ్, గౌరవాధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, తిరుపతయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి రవీందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ రఘురాములు, యాదయ్యగౌడ్, గోపాల్‌గౌడ్, నర్సింహులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

మూసాపేట, సెప్టెంబర్ 17 : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీవో అనురాధ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని నిజాలాపూర్‌లో అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ నాలుగు మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ ఈశ్వర్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

జడ్చర్ల, సెప్టెంబర్ 17 : మండలంలోని మాటుబండతండాకు చెందిన బుడ్యానాయక్(90)సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తండా మాజీ సర్పంచ్ దీపక్‌రాథోడ్ బుడ్యానాయక్ ఇంటికి వెళ్లి మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వాల్య, టోపియా, హన్మంతు, రాజు, లచ్చు, శ్రీకాంత్, శంకర్, భీముడు, రవి, మున్నా ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మూసాపేట(అడ్డాకుల), సెప్టెంబర్ 17 : మోటర్ సైకిల్‌ను బొలెరో వాహనం ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని శాఖాపూర్‌కు చెందిన రవీందర్‌గౌడ్, రామకృష్ణగౌడ్ మోటర్ సైకిల్‌పై మంగళవారం అడ్డాకులకు వెళ్తున్నారు. మార్గమధ్యంలో కాటవరం జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం వెనక నుంచి వేగంగా ఢీకొట్టింది. దీంతో రవీందర్‌గౌడ్, రామకృష్ణగౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు అంబెలెన్స్‌లో జిల్లా దవాఖానకు తరలించారు. కాగా, బొలెరో డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

## కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసిన డీపీవో

మరికల్, సెప్టెంబర్ 17 : మండలంలోని పస్పుల వద్ద గల కేజీబీవీ పాఠశాలను మంగళవారం డీపీవో, మరికల్ మండల ప్రత్యేకాధికారి కృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు.

## రాష్ట్రస్థాయి ఖోఖోకు విద్యార్థుల ఎంపిక

మరికల్, సెప్టెంబర్ 17 : రాష్ట్ర స్థాయి ఖోఖో సబ్ జూనియర్ పోటీలకు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు సుశాంత్, స్వప్న ఎంపికైనట్లు హెచ్ఎం నాగరత్నమ్మ తెలిపారు. మంగళవారం విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో పీడీ వెంకటేశ్ పాల్గొన్నారు.

## స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలి

మక్తల్, సెప్టెంబర్ 17 : పీడీఎస్‌యూ 50ఏండ్ల స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ కోరారు. మంగళవారం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో సభ నిర్వహించనున్నారు.

# తమ్ముడి భూమిని కాజేసిన అన్న

నవాబ్‌పేట, సెప్టెంబర్ 17 : మండలంలోని కిషన్‌గూడకు చెందిన కల్మి కేశవులు భూమిని అతడి అన్న కల్మి అంజయ్య అక్రమంగా పట్టా చేసుకున్నాడని మంగళవారం బాధితుడు కేశవులు గ్రామస్తులతో కలిసి రెవెన్యూ, పోలీస్ అధికారులను ఆశ్రయించాడు. కేశవులుకు గ్రామ శివారులో సర్వేనెంబర్ 71, 72లో వ్యవసాయ భూమి ఉంది. గత నెల 7వ తేదీన తన అన్న మాయమాటలు చెప్పి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని, న్యాయం చేయాలని తాసీల్దార్ గాయత్రి, ఎస్సై విక్రమ్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు నిర్మలమ్మ, చెన్నయ్య, సురేందర్, శ్యాంసుందర్‌రెడ్డి, చెన్నయ్య ఉన్నారు.

# రైతులకు అందుబాటులో ఉండాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 17 : వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి సేవలందించాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో వ్యవసాయశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రుణమాఫీ, క్రాప్ బుకింగ్, రైతు బీమా, క్రాప్ డ్యామేజ్ తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ గరీమనరుల, ఏడీఏ జాన్‌సుధాకర్, వివిధ మండలాల ఏవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.




















